ప్రభాత గమనం
తెలుగు దినపత్రికలో పనిచేయడానికి
ఆసక్తి కలవారికి ఆహ్వానము.
వివరాలకు సంప్రదించండి : 7780470374
మహబూబాబాద్ జిల్లాలో ఖాళీలు :

| | | | |
|---|---|---|---|
| కొత్తగూడ | గార్ల / కురవి | దంతాలపల్లి | పెద్దవంగర |
| గంగారం | బయ్యారం | చిన్నగూడూరు | నెల్లికుదురు |
| కేసముద్రం | మరిపెడ | నర్సింహులపేట | ఇనుగుర్తి |


TELTEL/2022/83842
PRABHATA GAMANAM
ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
శనివారం 21, మార్చి 2026 | వరంగల్ | సంపుటి :04 | సంచిక :185 | పేజీలు :4 | వెల. 3/-





"కష్టాల్లో ఉన్నవారికి 'నేనున్నాను' అని భరోసా ఇవ్వడమే నిజమైన నాయకత్వం."
- సమ్మీ గౌడ్ ఫౌండేషన్

2

# సమాజ సేవలో సమ్మీ గౌడ్

"అధికారం ఉన్నా లేకపోయినా.. ఆపదలో ఉన్నవారికి అండగా నిలవడమే అసలైన సేవా ధర్మమని సమ్మీ గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ప్రముఖ సామాజిక కార్యకర్త చిలువేరు సమ్మీ గౌడ్ మరోసారి చాటిచెప్పారు. కష్టాల్లో ఉన్న ఆర్తుల పిలుపు వినిపించడమే ఆలస్యం.. 'నేనున్నాను' అంటూ భరోసానిస్తూ అపన్నహస్తం అందించడంలో తనకు తానే సాటి అని నిరూపించుకున్నారు. గత ఆరు నెలలుగా ప్రభుత్వం నుండి వేతనాలు అందక, నిత్యం ప్రాణాలకు తెగించి ఆసుపత్రిలో సేవలు అందిస్తున్నప్పటికీ, ఇంట్లో పూట గడవని స్థితిలో ఉన్న దినసరి ఒప్పంద కార్మికుల దీనగాథ సమ్మీ గౌడ్ మనసును కలిచివేసింది. రాబోయే ఉగాది, రంజాన్ పండుగల వేళ ఆ పేద కార్మికుల ఇళ్లల్లో కనీసం దీపం వెలిగే పరిస్థితి లేదని తెలుసుకున్న ఆయన, తక్షణమే స్పందించి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. కులమతాలకు అతీతంగా, మానవత్వమే పరమావధిగా సాగుతున్న ఆయన సేవా యజ్ఞం ఇప్పుడు కేసముద్రం నియోజకవర్గవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది."

- ఆరు నెలలుగా జీతాల్లేక అవస్థలు..
- నిత్యావసరాలు పంపిణీ చేసిన చిలువేరు సమ్మీ గౌడ్.
- ఉగాది, రంజాన్ పర్వదినాల వేళ ఐదుగురు కార్మికులకు నెలకు సరిపడా సరుకుల పంపిణీ.
- ఆకలి తీర్చిన అపన్నహస్తం.. దినసరి కార్మికులకు సమ్మీ గౌడ్ భరోసా!
- వేతనాలు లేక తల్లడిల్లుతున్న వేళ.. 'దేవుడిలా' అండగా నిలిచిన సమ్మీ గౌడ్ ఫౌండేషన్.
- బెథోలు గ్రామంలోని కార్మికుల ఇళ్లకే వెళ్లి సాయం అందజేత..
- కన్నీటి పర్యంతమైన లబ్ధిదారులు.

## పట్టణాభివృద్ధికి పెద్దపీట

- రూ.17,907 కోట్లు కేటాయింపు
- మున్సిపాలిటీలకు రూ.5వేల కోట్లకుపైగా
- మున్సిపల్ వ్యర్థాల నిర్వహణ, యూజ్డ్ వాటర్ నిర్వహణకు రూ.250 కోట్లు
- కొత్త మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.754 కోట్లు

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు పెద్దపీట వేసింది. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన రూ.17,677 కోట్లకు అదనంగా రూ.230 కోట్లు కేటాయించింది. ఈ సారి కేటాయించిన రూ.17,907 కోట్లలో ఎస్టాబ్లిష్‌మెంట్‌కు రూ.7,458 కోట్లు, పథకాలకు రూ.10,450 కోట్లు వెచ్చించనుంది. భారత్ ఫ్యూచర్ సిటీకి రూ.300 కోట్లు కేటాయించడం విశేషం. మూసీ పునరుజ్జీవనం, మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టులకు సైతం నిధులు కేటాయించారు.

2

శనివారం
21.03.2026
www.prabhatagamanam.com


ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక



# సమాజ సేవలో సమ్మిగౌడ్

- సమ్మన్న సేవలకు సరిలేరు
- పేదల పాలిట ఆపద్బాంధవుడు
- ఎన్ హెచ్ఎం జిల్లా అధ్యక్షులు డా.కుమార్ డుంగ్రోత్...
- ఆకలితో అలమటిస్తున్న శిశు సంరక్షణ విభాగం దినసరి కార్మికులకు నెల రోజులకు సరిపడా నిత్యావసరాల పంపిణీ
- మరోసారి మానవత్వాన్ని చాటుకున్న జన నాయకుడు...
- ఐదుగురు పేద ముస్లిం లకు రంజాన్ పర్వదినాల్లో సమ్మి గౌడ్ ఫౌండేషన్ ద్వారా చేయూత...

కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం): సమ్మిగౌడ్ అందుబాటులో లేకపోయినా కష్టాల్లో ఉన్నవారికి "నేనున్నాను" అని భరోసా ఇస్తూ, అపన్నహస్తం అందించడంలో సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిలువేరు సమ్మి గౌడ్ (కేసముద్రం) మరోసారి తన పెద్ద మనసును చాటుకున్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని అత్యవసర శిశు సంరక్షణ విభాగంలో పనిచేస్తున్న దినసరి ఒప్పంద కార్మికుల దీనస్థితిని చూసి ఆయన చలించిపోయారు.గత ఆరు నెలలుగా ప్రభుత్వం నుండి వేతనాలు అందక, నిత్యావసరాలు కొనుక్కోలేక ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఈ కార్మికుల సమస్యను జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగ సంఘాల ఉమ్మడి కార్యాచరణ కమిటీ ప్రతినిధులు సమ్మి గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన తక్షణమే స్పందించి, రాబోయే ఉగాది మరియు రంజాన్ పండుగలను పురస్కరించుకుని, ఐదుగురు కార్మికుల (సలేహా, మౌలబీ, రెహానా, వెంకటమ్మ, శివ) కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులను నేరుగా వారి ఇళ్లకే (బెథోలు గ్రామం) పంపించి పంపిణీ చేయించారు.




### ఆయన సాయం మరువలేనిది..

**– డా. కుమార్ డుంగ్రోతు**

ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగ సంఘాల జిల్లా అధ్యక్షుడు డా. కుమార్ దుంగ్రోతు మాట్లాడుతూ.. "నేడు ఆపదలో ఉన్న వారిని ఆదుకునే గుణం కలిగిన ఏకైక నాయకుడు సమ్మి గౌడ్ అని కొనియాడారు. ఆరు నెలలుగా జీతాలు లేక మా సిబ్బంది పడుతున్న నరకాన్ని అర్థం చేసుకుని, వారికి వెన్నుముకగా నిలిచిన 'ఆపద్బాంధవుడు' ఆయన అని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఆయన సేవా కార్యక్రమాలు ఇలాగే కొనసాగాలి" అని ఆకాంక్షించారు..

### - కన్నీటి పర్యంతమైన కార్మికులు

లబ్ధిదారురాలు సలేహా మాట్లాడుతూ.. "రోజు వారీ కూలీలకు కూడా నెలకు పదివేలు వస్తున్నాయి, కానీ ఆరు నెలలుగా ప్రాణాలకు తెగించి ఆసుపత్రిలో పనిచేస్తున్న మాకు చిల్లిగవ్వ అందలేదు. ఇంట్లో కనీసం తినడానికి గింజలు లేని క్లిష్ట పరిస్థితిలో సమ్మి గౌడ్ దేవుడిలా వచ్చి ఆదుకున్నారు" అని ఆవేదనతో కూడిన కృతజ్ఞతలు తెలిపారు...

### - సరిలేరు నికేవ్వరు...

సమాజంలో కులం, మతం, ప్రాంతం చూడకుండ పేదలకు కష్టం వచ్చిందంటే నేనున్నాను అంటూ భరోసా ఇస్తున్నారు. ఈయన చేస్తున్న సేవలకు సరిలేరు నికేవ్వరు అంటూ జేజేలు కొడుతున్నారు. ఇలాంటి వ్యక్తులు పాలకులైతే ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయని అభిప్రాయం వ్యక్తం అవుతున్నాయి. ఈ కార్యక్రమంలో ఉద్యోగ సంఘాల కార్యనిర్వహణ అధ్యక్షుడు డా. కందుల నాగరాజు, ప్రధాన కార్యదర్శి పొన్నం కవిత, ఉపాధ్యక్షురాలు దార్ల జ్యోతి, సభ్యులు నీల, సరిత, యజ్ఞేశ్వర్, ఖాజా పాషా, సత్తార్, యాకుబ్ పాషా, కిరణ్ మరియు బెథోలు గ్రామానికి చెందిన సుమారు 50 మంది గ్రామస్థులు పాల్గొన్నారు..




# గొడవలో తల దూర్చాడని చెవి కొరికేశాడు

### - అవుతాపురంలో ఘటన

ప్రభాత గమనం, మహబూబాబాద్ : గొడవలో తల దూర్చాడని ఆగ్రహానికి లోనైన ఓ వ్యక్తి.. బాధిత వ్యక్తి చెవి కొరికిన ఘటన మహబూబాబాద్ జిల్లా పెద్దగూడూరు మండలం అవుతాపురంలో జరిగింది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అలంకానిపేట గ్రామానికి చెందిన జోగు సతీష్ అనే వ్యక్తి అవుతాపురం గ్రామానికి చెందిన ముగ్గురితో గొడవ పడుతున్నాడు. అదే గ్రామానికి చెందిన బందు శశి కుమార్, గద్దల రోహిత్, చెదుపాక సాంబశివ అనే ముగ్గురు అక్కడికి వచ్చి గొడవను ఆపేందుకు ప్రయత్నించారు. దీనికి ఆగ్రహించిన సతీష్.. బందు శశి కుమార్ చెవిని నోటితో గట్టిగా కొరకడంతో చెవి భాగం కొంత ఊడి పడిపోయింది. గాయపడ్డ శశికుమార్‌ను ఆసుపత్రికి తరలించారు. బాధితుడి సోదరుడు వెంకన్న పోలీసులకు సమాచారం ఇవ్వగా పెద్ద వంగర ఎస్సు చిలువేరి ప్రమోద్ కుమార్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకొని విచారణ జరిపి కేసు దర్యాప్తు చేపట్టారు.

# పట్టణాభివృద్ధికి పెద్దపీట



- రూ.17,907 కోట్లు కేటాయింపు
- మున్సిపాలిటీలకు రూ.5వేల కోట్లకుపైగా
- మున్సిపల్ వ్యర్థాల నిర్వహణ, యూజ్డ్ వాటర్ నిర్వహణకు రూ.250 కోట్లు
- కొత్త మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.754 కోట్లు

**ప్రభాత గమనం, హైదరాబాద్ :**

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు పెద్దపీట వేసింది. గతేడాది బడ్జెట్‌లో కేటాయించిన రూ.17,677 కోట్లకు అదనంగా రూ.230 కోట్లు కేటాయించింది. ఈ సారి కేటాయించిన రూ.17,907 కోట్లలో ఎస్టాబ్లిష్‌మెంట్‌కు రూ.7,458 కోట్లు, పథకాలకు రూ.10,450 కోట్లు వెచ్చించనుంది. భారత్ ఫ్యూచర్ సిటీకి రూ.300 కోట్లు కేటాయించడం విశేషం. మూసీ పునరుజ్జీవనం, మెట్రోరైలు రెండో దశ ప్రాజెక్టులకు సైతం నిధులు కేటాయించారు.

### మున్సిపాలిటీలకు రూ.5 వేల కోట్లు

రాష్ట్రంలోని మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీల అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లకుపైగా కేటాయించారు. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లు అయిన మహబూబ్ నగర్, మంచిర్యాల, కొత్తగూడెంలకు రూ.1000 కోట్లు.. అలాగే వరంగల్ నగరానికి రూ.40 కోట్లు, ఖమ్మం నగరానికి రూ.15 కోట్లు ప్రత్యేకంగా ఇవ్వనున్నారు. మిగిలిన కార్పొరేషన్లకు మరో రూ.50 కోట్లు వెచ్చించనున్నారు. లక్ష జనాభా కన్నా తక్కువగా ఉన్న మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం రూ.1483 కోట్లు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ ద్వారా మ్యాచింగ్ గ్రాంట్స్ రూ.1483 కోట్లు ఇవ్వనున్నారు. పెండింగ్‌లో ఉన్న మున్సిపల్ మార్కెట్లను పూర్తిచేయడానికి రూ.100 కోట్లు కేటాయించారు. మున్సిపల్ వ్యర్థాల నిర్వహణకు రూ.150 కోట్లు, స్వచ్ఛ భారత్ మిషన్ స్కీమ్‌లో భాగంగా ఎస్టీపీల ద్వారా శుద్ధి చేసిన నీటి నిర్వహణకు రూ.100 కోట్లు, కమ్యూనిటీ టాయిలెట్ల నిర్వహణకు రూ.30 కోట్లు, కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, శ్మశానవాటికలను అభివృద్ధి చేయడానికి రూ.10 కోట్లు వెచ్చించనున్నారు. స్వచ్ఛ భారత్ మిషన్ స్కీమ్‌లో స్కిల్ డెవలప్‌మెంట్, కెపాసిటీ బిల్డింగ్ కోసం రూ.54 కోట్లు, మున్సిపాలిటీల్లో ఎన్నికల నిర్వహణ, ఇతర కార్యక్రమాల కోసం నిధులు కేటాయించారు. ఫ్యూచర్ సిటీకి రూ.300 కోట్లు ఇవ్వనున్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం

**ఒకరు మృతి, ఆరుగురికి తీవ్ర గాయాలు**

ప్రభాత గమనం, మరిపెడ : మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలోని పురుషోత్తమాయ గూడెం సమీపంలో జాతీయ రహదారి 365పై శుక్రవారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మహబూబాబాద్ నుంచి మరిపెడ వైపు వస్తున్న కారు అతివేగంతో ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఏడుగురికి తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలించే క్రమంలో రామస్వామి వెంకన్న మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.ప్రమాద సమయంలో ఆటోలో పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన కుటుంబ సభ్యులు శుభకార్యానికి వెళ్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. గాయపడిన వారిని మెరుగైన చికిత్స కోసం ఖమ్మం ఆసుపత్రికి తరలించారు.సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని, అతివేగంగా వాహనం నడిపినందుకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.



## పెనుగొండలో వీధి కుక్కల దాడి

కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం):కేసముద్రం మండలం పెనుగొండ గ్రామంలో వీధికుక్కలు మంగళ వారం రాత్రి హడలెత్తించాయి గ్రామానికి చెందిన రైతు ముదిగిరి మల్లయ్యకి చెందిన పశువులపై వీధి శునకాలు దాడి చేశాయి. అయిదు కుక్కలు అర్ధరాత్రి వచ్చి లేగదూడపై దాడి చేసి చంపాయని ఆ రైతు ఆవేదన వ్యక్తం చేశారు. అత్యంత భయానకంగా దూడపై దాడి చేయడంతో మెడ పొట్ట భాగంలో తీవ్రంగా గాయాలయ్యాయి. గ్రామంలో వీధి కుక్కల స్వైర విహారాన్ని తగ్గించాలని రైతులు కోరుతున్నారు.ఇప్పటికైనా గ్రామ పాలక వర్గం స్పందించాలని గ్రామస్థులు వేడుకుంటున్నారు.

# విద్యావ్యవస్థలో భారీ మార్పులు

- **పదో తరగతి బోర్డు పరీక్షల రద్దు**
- **సీఎం రేవంత్ రెడ్డి ప్రకటన**




అక్షరదర్బార్, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్ర విద్యావిధానంలో విప్లవాత్మక మార్పులు తీసుకు రావాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందులో భాగంగా భవిష్యత్తులో పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో నిర్వహించిన చిట్ చాట్‌లో ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ప్లస్ టూ (+2) విద్యా విధానం అమలులో ఉందని, దానిని అధ్యయనం చేసిన తర్వాతే రాష్ట్రంలో మార్పులు చేస్తామని తెలిపారు. త్వరలోనే ఎస్సెస్సీ బోర్డు రద్దు కానుందని, అయితే, క మిషన్ నివేదికే ఫైనల్ కాదని, విద్యావ్యవస్థలో సమూల ప్రక్షాళన కోసం మరిన్ని అధ్యయనాలు నిర్వహిస్తామని ఆయన వివరించారు.



# కేటీపీపీలో సాంకేతిక లోపం

**- 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తికి బ్రేక్**

ప్రభాత గమనం, చెల్పూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం చెల్పూర్ వద్ద ఉన్న కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ (కేటీపీపీ)లో సాంకేతిక సమస్య తలెత్తింది. మొదటి దశలోని 500 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో బాయిలర్ ట్యూబ్ లీకేజీ కావడంతో శుక్రవారం విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. బాయిలర్ ట్యూబ్ లీకేజీ కారణంగా మొదటి యూనిట్‌లో ఉత్పత్తిని అధికారులు నిలిపివేయాల్సి వచ్చింది. ఉత్పత్తి నిలిచిపోవడం వల్ల రోజుకు సుమారు రూ.2 కోట్ల మేర నష్టం వాటిల్లుతున్నట్లు సమాచారం. లీకేజీని గుర్తించిన కేటీపీపీ ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది వెంటనే మరమ్మత్తు పనులు ప్రారంభించారు. బాయిలర్ చల్లబడిన తర్వాత పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసి, తిరిగి ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న తరుణంలో, కీలకమైన 500 మెగావాట్ల ఉత్పత్తి నిలిచిపోవడం ప్రాధాన్యత సంతరించుకుంది.




# హుస్సేన్ నాయక్ కు కాంగ్రెస్ నేతల పరామర్శ..

కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం): జాతీయ ఎస్టీ కమీషన్ మెంబర్ జాటోత్ హుస్సేన్ నాయక్ తండ్రి లచ్చనాయక్ ఇటీవలె అనారోగ్యంతో మృతి చెందారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అల్లం నాగేశ్వరరావు, కాంగ్రెస్ మండల నాయకులు సమ్మయ్య గౌడ్, బానోత్ చిన్న వెంకన్నలు హుస్సేన్ ను పరామర్శించారు. లచ్చి నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. లచ్చి నాయక్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేసి మనో ధైర్యాన్ని కల్పించారు...



## భారీగా గంజాయి పట్టివేత

హైదరాబాద్ మార్చి 20(ప్రభాత గమనం) : భద్రాద్రి కొత్త గూడెం జిల్లాలో భారీగా గంజాయి పట్టుబడింది. ఒడిశా నుంచి జహీరాబాద్‌కు కారులో గంజాయి తరలిస్తున్న ఓ యువకుడిని ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకున్నారు. భద్రాచలం ఇసుక ర్యాంప్ సమీపంలో ఆ యువకుడిని పట్టుకున్నారు. సుమారు 41 లక్షల రూపాయల విలువ గల దాదాపు 52 కేజీల ఎండు గంజాయిని నిందితుడు తరలిస్తున్నాడు. నిందితుడిని అరెస్ట్ చేసిన పోలీసులు గంజాయిని, కారును సీజ్ చేశారు.

## చిన్నారుల కిడ్నాప్ యత్నం..

**కిడ్నాపర్లపై రాళ్లతో దాడికి దిగిన పిల్లలు**

హైదరాబాద్ మార్చి 20(ప్రభాత గమనం): సంగారెడ్డి జిల్లాలోని బృందావన్ కాలనీలో ఉగాది పండుగ పూట ఐదుగురు చిన్నారుల కిడ్నాప్ యత్నం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా ఉన్న సమయంలో ముగ్గురు దుండగులు ఆటోలో వచ్చి ఆడుకుంటున్న పిల్లలను అపహరించేందుకు ప్రయత్నించారు. అయితే చిన్నారుల సాహసం, సమయస్ఫూర్తి వల్ల ఒక పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. ఉగాది పండుగ కావడంతో కాలనీవాసులంతా భోజనాలు ముగించుకుని ఇళ్లలో విశ్రాంతి తీసుకుంటున్న సమయంలో, ఐదుగురు చిన్నారులు బయట ఆడుకుంటున్నారు. అదే అదునుగా భావించిన ముగ్గురు వ్యక్తులు ఒక ఎలక్ట్రిక్ ఆటోలో అక్కడికి చేరుకున్నారు.వారిలో ఒకరు ఒక బాలుడిని పట్టుకుని ఆటోలోకి లాగేందుకు ప్రయత్నించగా, ఆ బాలుడు గట్టిగా కేకలు వేశాడు. వెంటనే అప్రమత్తమైన మిగతా నలుగురు చిన్నారులు భయపడకుండా రాళ్లతో కిడ్నాపర్లపై దాడికి దిగారు. పిల్లలందరూ కలిసి పెద్దగా అరుపులు కేకలు వేయడంతో స్థానికులు భారీగా అక్కడికి చేరుకున్నారు.జనం వస్తున్నట్లు గమనించిన నిందితులు భయంతో ఆటోలోనే వేగంగా పరారయ్యారు.

## ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా" సంతోషకరం

**- గుడిచుట్టు నవీన్ యాదవ్**



గార్ల మార్చి 20(ప్రభాత గమనం): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాన్ని ప్రవేశ పెట్టడం సంతోషకరమని టిపిసిసి సోషల్ మీడియా కోఆర్డినేటర్ గుడి చుట్టూ నవీన్ యాదవ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్లో ఇందిరమ్మ కుటుంబ జీవన బీమా పథకాన్ని ప్రవేశపెట్టడంతో కోట్లాదిమంది నిరుపేదలకు లబ్ధి చేకూరుతుందని హర్షం వ్యక్తం చేశారు.పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ప్రశంసనీయమని కొనియాడారు.అకాల మరణం సంభవిస్తే కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచే ఈ భీమా ఆ కుటుంబానికి రక్షణ కల్పించడం అదృష్టమన్నారు.జీవన బీమా పథకం అమలు ద్వారా సమాజంలో ఆర్థిక స్థిరత్వం పెరుగుతుందని, పేద కుటుంబాలకు ఇది ఒక భరోసా కలిగించే కార్యక్రమమని పేర్కొన్నారు.ఈ పథకంతో రాష్ట్రంలోని సుమారు ఒక కోటి పదిహేను లక్షల కుటుంబాలకు న్యాయం చేయడం జరుగుతుందన్నారు. ఈ ఘనత ఒక్క కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని ఈ సందర్భంగా ఆయన హర్షం వ్యక్తం చేశారు.

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక

# పునాదులు తీశారు.. పనులు మరిచారు

## - వ్యవసాయ మార్కెట్ లో నత్తనడకన గోదాం నిర్మాణ పనులు

కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం):
కేసముద్రం వ్యవసాయ మార్కెట్ లో పునాదుల రంధ్రాలను తీశారు కానీ పనులు మొదలు పెట్టడం మరిచారు. గత రెండు నెలల క్రితం వ్యవసాయ మార్కెట్ లో గోదాం నిర్మించడానికి పునాదులను తీశారు. కానీ పనులు ఇంకా మొదలు పెట్టడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ధాన్యాన్ని మార్కెట్ లో పోయడానికి స్థలం లేదని వాపోతున్నారు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమా లేక మార్కెట్ అధికారుల పట్టింపులేని తనమా అర్థం కాక రైతులు మదన పడుతున్నారు. ఇలా పనులు నత్తనడకన సాగుతుంటే పాలకవర్గానికి కన్పించడం లేదా లేక నిద్రపోతున్నారా అని కార్మిక సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఆసియా ఖండంలోనే పేరుగాంచిన వ్యవసాయ మార్కెట్ లో పనులు మొదలు పెట్టి నెలలు గడుస్తున్న ముందుకు సాగలేక పోతున్నాయి. మరి ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న మార్కెట్ లో తాబేలు నడక వలె పనులు జరుగుతున్నాయి. యాసంగిలో మార్కెట్ కు కొన్ని క్వింటాళ్ల ధాన్యం పోటెత్తే అవకాశం ఉంది . ఆ సమయానికైనా గోదాం పూర్తవుతుందా లేక వచ్చే యాసంగి వరకు పనులు జరుగుతాయా వేచి చూడాలి...





# గ్యాస్ ధరలతో సామాన్యులపై భారం

## యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూక్య వెంకటేష్

గార్ల మార్చి 20(ప్రభాత గమనం):
రోజురోజుకు పెరుగుతున్న గ్యాస్ ధరలతో సామాన్యులు సతమతమవుతున్నారని యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి భూక్య వెంకటేష్ కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం నాడు కొప్పురాయి గ్రామపంచాయతీలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రోజురోజుకు పెరుగుతున్న గ్యాస్ ధరలు సామాన్య ప్రజలపై తీవ్ర భారం మోపుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మధ్యతరగతి,పేద ప్రజల జీవన వ్యయాలు పెరిగిపోతున్న ఈ సమయంలో గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.  దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన విధానాలను యువజన కాంగ్రెస్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్ , కొప్పురాయి సర్పంచ్ చింత కళ్యాణ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జారే సమ్మక్క,ఈసాల రవి, వార్డ్ మెంబెర్స్ జారే మంగయ్య, జరుపుల శంకర్,జారే ఆదినారాయణ, గదేశ్, తదితరులు పాల్గొన్నారు.

# నిజాం దుశ్చర్యలను ఎదురించిన గిరిజన ముద్దు బిడ్డ ఠానునాయక్


గార్ల మార్చి 20(ప్రభాత గమనం):
నిజాం దొరలు లంబాడా ఆడపడుచులపై చేస్తున్న అత్యాచారాలు, దాడులు, జరుగుతున్న అన్యాయాలపై తల్లి ఆశీర్వాదం తీసుకుని అక్కడి నుండి తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాం దుశ్చర్యలను ఎదురించి రజాకార్ల తుపాకీ గుళ్ళకి వెనక్కి తగ్గని గొప్ప పోరాట వీరుడు ఠాను నాయక్ అని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ అన్నారు.భూమి కోసం,భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాట స్ఫూర్తితో ఉద్యమించిన గిరిజన ముద్దుబిడ్డ ఠాను నాయక్ వర్ధంతిని సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మంగపతిరావు భవనంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఠాను నాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో కమ్యూనిస్ట్ నాయకుడైనా ఠాను నాయక్ నల్లా నర్సింహులు, మల్లు స్వరాజ్యం, భీంరెడ్డి, నర్సింహారెడ్డి తో కలిసి వీరోచిత పోరాటం చేశారని,నిజాం పాలనకు వ్యతిరేకంగా వీరోచిత పోరాటం చేసి ప్రజలకు న్యాయం చేసిన ఠాను నాయక్ విగ్రహం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు, గిరిజనులు,గుగులోత్ సుమన్, భూక్య శివ కృష్ణ, జాటోత్ వస్య, ప్రవీణ్, రమేష్, అంజయ్య,శ్రీను, నవీన్ తదితరులున్నారు.



# శ్రీ వివేక వర్ధినిలో ముందస్తు రంజాన్ వేడుకలు

కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం):
మండల కేంద్రంలోని శ్రీ వివేకవర్ధిని హైస్కూల్లో ముందస్తు రంజాన్ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణం పండుగ వాతావరణంతో కళకళలాడింది.ఈ సందర్భంగా కరస్పాండెంట్ చిర్రయాకాంతం గౌడ్ మాట్లాడుతూ..రంజాన్ పర్వదినం యొక్క ఆధ్యాత్మికత, ఉపవాస దీక్ష ప్రాముఖ్యత, సహనం మరియు దాతృత్వం వంటి విలువలను వివరించారు. రంజాన్ మనుషుల మధ్య సోదరభావాన్ని పెంపొందించే పవిత్ర పండుగ అని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేస్తున్న ముస్లిం సిబ్బందిని ప్రత్యేకంగా సన్మానించి అభినందించారు. వారి సేవలను ప్రశంసిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని రంజాన్ పర్వదిన సందేశాలను ఆసక్తిగా వినిపించారు. ఈ వేడుకలు విద్యార్థుల్లో సామాజిక, సాంస్కృతిక విలువలను పెంపొందించే విధంగా జరిగాయని నిర్వాహకులు తెలిపారు.





# నూతన వధూవరులను ఆశీర్వదించిన మున్సిపల్ చైర్మన్ సునీత వెంకన్న

కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం):
కేసముద్రం మండలం చంద్రుతండా గ్రామపంచాయతిలోని ఓ వివాహ వేడుకకు కేసముద్రం మున్సిపాలిటీ చైర్మన్ బానోత్ సునీత వెంకన్న శుక్రవారం నాడు హాజరయ్యారు. ఈ సందర్భంగా గుగులోత్ భద్రి లింగ్యా దంపతుల కుమార్తె వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో బాదావత్ సుమన్, భూక్యా సురేష్,బానోత్ వెంకన్న, రంగా, సేవల్, కుమార్, సంతోష్, రాజేందర్, అజిత్, దుర్గప్రసాద్, తరుణ్, అఖిల్ తదితరలు పాల్గొన్నారు.

# విద్యకు నామమాత్రపు కేటాయింపులెలా?

## డీఎస్ఏ రాష్ట్ర కన్వీనర్ కామగోని శ్రావణ్



కేసముద్రం మార్చి 20(ప్రభాత గమనం):
తెలంగాణ రాష్ట్ర శాసనసభలో ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్లో విద్యారంగానికి కేవలం నామమాత్రపు కేటాయింపులే కేటాంచడాన్ని డెమోక్రటిక్ స్టూడెంట్స్ అసోసియేషన్ పక్షాన తీవ్రంగా ఖండిస్తున్నట్లు డిఎస్ఏ రాష్ట్ర కన్వినర్ కామగోని శ్రావణ్ అన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ..డొంక తిరుగుడు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో విద్యా రంగానికి 15శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి తీరా అధికారంలోకి వచ్చాక నామమాత్రపు నిధులను 26,674కోట్లు అనగా బడ్జెట్ లో 8.22శాతం నిధులను మాత్రమే కేటాయిస్తూ చేతులు దులుపుకుందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించారు. గత పాలకుల వలే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రభుత్వ రంగ విద్యా వ్యవస్థను నీరుగార్చే ప్రయత్నమే చేస్తున్నదని, ఇప్పటికే రాష్ట్రములో దాదాపు ఎనమిది వేల కోట్ల ఫీజు రీంబుర్స్మెంట్, స్కాలర్షిప్స్ బకాయిలు ప్రభుత్వం విడుదల చెయ్యకుండా, విద్యార్థుల పై చదువులకు ఆటంకం కలిగిస్తూ ప్రస్తుత బడ్జెట్లో విద్యారంగానికి నామమాత్రపు కేటాయింపులే కేటాయించడం అంటే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రభుత్వ విద్యా వ్యవస్థపై కపట ప్రేమను చూపిస్తుందనీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థ బలోపేతం కోసం, విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు పునాధుల కోసం బడ్జెట్ ను సవరించి వెంటనే విద్యారంగానికి 20శాతం నిధులు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని యేడల విద్యారంగ పటిష్టత కోసం భవిష్యత్తు ప్రణాళికను సిద్ధం చేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాలకు పిలుపునిస్తామనీ హెచ్చరించారు.

Published and Owned by Pitta Sreekanth at .H NO 1-7-883/6/101 VIVEKANANDA COLONY HUNTER ROAD HANUMAKONDA, WARANGAL URBAN, TELANGANA, 506001 Editor. P. Ravichandra